www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
30 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 302

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## విద్యాసంస్థలకు సెలవులు

మొంథా తుఫాన్‌లో భారీ వర్షా లు 03

## కిషన్ రెడ్డీ..యూసూఫ్ గూడా
# చౌరస్తాకు రా!

- కిషన్ రెడ్డీ..యూసూఫ్ గూడా చౌరస్తాకు రా!
- జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక
- నవీన్ యాదవ్ ను గెలిపించాలన్న పొన్నం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అబద్ధాలకు మధ్య పోరు
- కిషన్ రెడ్డి ఈ నియోజకవర్గానికి ఏం చేశారు
- ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నారు
- జూబ్లీహిల్స్ ప్రజలకు అల్టీమేటం జారీ చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి కి ప్రజలు పట్టం కడుతున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ బై ఎలక్షన్స్ ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని.. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి, బీఆర్ఎస్ అబద్ధాలకు మధ్య పోరుగా మంత్రి అభివర్ణించారు.

జూబ్లీహిల్స్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మీకు అభివృద్ధి కావాలా? అబద్ధాలు కావాలా?' తేల్చుకోవాలని జూబ్లీహిల్స్ ప్రజలకు అల్టీమేటం జారీ చేశారు. 'జూబ్లీహిల్స్ లో బండలను కరిగించి పేదలకి ఇండ్ల పట్టాలు, ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి చూపింది కాంగ్రెస్. సన్న బియ్యంతో మీ ఆకలి తీర్చింది కాంగ్రెస్' అంటూ పొన్నం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చి ఉచిత బస్సు ప్రయాణం.. మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతోందని మంత్రి పొన్నం అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా అర్హత ఉన్న అందరికీ నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేశాం. ఇది నిరంతర ప్రక్రియ. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2 లక్షల 40 వేల మందికి పైగా ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందుతున్నాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. రూ.500కి గ్యాస్ అందిస్తున్నాం. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నాం. 80 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం' అని పొన్నం వివరించారు.

బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఏం అభివృద్ధి చేసిందో చెప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పొన్నం విమర్శించారు. ఓటు చోరీ అంటూ బీఆర్ఎస్, బీజేపీ ఓటు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని మండిపడ్డారు. 'మా అభ్యర్థి బీసీ బిడ్డ, విద్యావంతుడు, నిత్యం ప్రజల్లో ఉండే నవీన్ యాదవ్ ను రౌడీ అంటున్నారు. వాళ్ళు ఎన్ని అన్న అవి మా ఆశీర్వాదాలు. ఇప్పుడు ఆటోలో ప్రయాణం చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారు. 2012 తరువాత నగరంలో ఒక్క ఆటోకి పర్మిట్ ఇవ్వలేదు. మేము 20వేల ఎలక్ట్రిక్ ఆటో లకు అనుమతి ఇచ్చాం. 10 వేల సీఎన్‌జీ, 10 వేల ఎల్‌పీజీ అటోలకు అనుమతి ఇచ్చాం. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇచ్చే దానిపై మాకు చిత్తశుద్ధి ఉంది' అని పొన్నం స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లో ఉన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గత 10 ఏళ్లలో ఈ నియోజకవర్గానికి ఏం చేశారని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. 'రామచంద్రరావు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఆ లేక యూసుఫ్ గూడా డివిజన్ అధ్యక్షుడా. ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు జూబ్లీహిల్స్ ను నిర్లక్ష్యం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి ఆ పార్టీలు ఏం చేశారో చర్చపెట్టాలి. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్, బీజేపీలు కలిపి పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ విధానాలను చెప్పే బాధ్యతను కిషన్ రెడ్డికి అప్పగించారు' అంటూ సెటైర్లు వేశారు.

## కోమటిరెడ్డి కుటుంబంపై
# చిన్నచూపు..!

### సినీ కార్మికుల సభలో కనిపించని మంత్రి వెంకట్ రెడ్డి

- అధిష్ఠానం హామీ ఇచ్చినా రాజగోపాల్ రెడ్డికి దక్కని మంత్రి పదవి
- అన్నకు ప్రాధాన్యత కరువు తమ్మునికి ఆదరణ లేదు
- చర్చనీయాంశంగా మారిన అజారుద్దీన్ మంత్రి పదవి





రాజగోపాల్ రెడ్డి ఇంటికి వచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి (ఫైల్ ఫోటో)

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంటకరెడ్డి అలకపూనారన్నది ఇండస్ట్రీ వర్గాల కథనం. మంగళవారం హైదరాబాద్ లో సినీ కార్మికుల సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డిని కార్మిక నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కార్మికులపై వరాల జల్లు కురిపించారు. అయితే ఈ వేదికపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి కనిపించలేదు. చిత్రసీమకు సంబంధించిన కార్యక్రమం ఇది. సినిమాటోగ్రఫీ మంత్రికి ఆహ్వానం అందడం ప్రోటోకాల్. అయితే మంత్రి ఆ సమయంలో ముంబైలో ఉన్నారు. తాను లేని సమయం చూసి, సినీ కార్మికుల సన్మాన సభ నిర్వహించడం ఏమిటన్నది ఆయన ఆవేదన. తన శాఖపై ఓ షాడో మంత్రి పెత్తనం చూపిస్తున్నారని, తనకూ, కార్మికులకూ మధ్య దూరం పెంచుతున్నాడని, తన ప్రమేయం లేకుండా ఇలాంటి సభలు నిర్వహించడం ఏమిటని కోమటి రెడ్డి తన సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అసలు ఇలాంటి సమావేశం ఒకటి నిర్వహిస్తున్నారన్న విషయం కూడా కోమటిరెడ్డికి తెలీదని సమాచారం.

కాంగ్రెస్ పార్టీ అన్న తర్వాత పంచాయితీలు లేకపోతే ఆశ్చర్యపోవాలికానీ పంచాయితీలుంటే అది సాధారణ విషయమే. టెక్నాలజీ అత్యంత వేగంగా మార్పును సంతరించుకుంటోంది. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం పాత చింతకాయ పచ్చడి తరహాలోనే ఉంటోంది. ఏ రాష్ట్రంలోను, ఏ మంత్రివర్గంలోను విభేదాలు ఉండటంలేదు. ఎవరి పని వారు చేసుకుంటూ వెళ్ళిపోతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం అలా జరగడంలేదు. మొన్నటి వరకు ఎమ్మెల్యే కోటమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.విరుచుకుపడీపడీ ఆయన అలసిపోయారేమో ఆయన స్థానంలోని ఆయన సోదరుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వచ్చారు. రేవంత్ ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత సినీ కార్మికులతో సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలోనే ఆయన ఒక నిర్ణయం తీసుకున్నారు. టికెట్లు పెంచుకోవడానికి అనుమతిస్తాం కానీ కాకపోతే కార్మికులకు 20 శాతం అదనపు వేతనాలు చెల్లించాలనే మెలిక పెట్టారు. అలా అయితేనే కొత్త సినిమాలు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతిస్తానని తేల్చిచెప్పారు. తర్వాత సినీ కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానించాయి.

మిగతా 2లో..

## ఓటుకు కాంగ్రెస్ పైసలిస్తే తీసుకోండి

- ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయండి
- రాష్ట్రంలో పాలన పడకేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం
- తులం బంగారం ఎక్కడ
- బీసీల హామీలు అమలు చేయాలి
- దొంగ ఓట్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

02



## తుఫానుపై సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం

- మొంథా తుపాన్ ప్రభావం
- సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు
- ధాన్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి
- పలు జిల్లాల్లో భారీ వర్షా లు
- సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు



02



## నల్లమలలో మావోయిస్టుల
# సీక్రెట్ మీటింగ్

- తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దులు
- దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం
- మావోయిస్టు సమావేశం జరిగినట్లు సమాచారం
- నూతన బాధ్యతలు అప్పగించేందుకు చర్చలు
- మిలటరీ కమిషన్ అధిపతిగా హిడ్మా
- కేంద్ర కమిటీ అధిపతిగా దేవుజీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దులోని దట్టమైన నల్లమల అడవుల్లో సీనియర్ మావోయిస్టు నాయకుల సమావేశం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. ఈ ప్రాంతంలోని అడవి టైగర్ రిజర్వుగా ఉండడంతో ఈ ప్రాంతంలో జనాభా తక్కువగా ఉంటుందని సమావేశాన్ని ఈ నెల 20వ తేదీన ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీ మిగతా 2లో..

## ఇంజినీరింగ్ కాలేజీలకు ఝలక్

- తెలంగాణ ప్రభుత్వం భారీ ఝలక్ ఇచ్చింది
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులలో అక్రమాలు
- ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది
- నవంబర్ 3 నుంచి కాలేజీలను మూసివేత
- బకాయిల విడుదలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- ప్రస్తుతం 2,500 ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలు

02



## అజారుద్దీన్‌కు లక్కీ ఛాన్స్

- రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు
- రేవంత్ రెడ్డి మంత్రివర్గం విస్తరణ
- 31న శుక్రవారం కేబినెట్ విస్తరణ
- అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం
- ముస్లింలకు ప్రాతినిధ్యం ఇచ్చేలా చర్చ
- అజారుద్దీన్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు

02



# కోమటిరెడ్డి కుటుంబంపై చిన్నచూపు..!

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ మాట్లాడిన 20 శాతం మాటలు వైరల్ కావడంతోపాటు ఆయనకు విపరీతమైన పాజిటివ్ ను తీసుకొచ్చింది. మీడియాలో ప్రముఖంగా ప్రసారమయ్యాయి. అయితే తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆ సమయంలో అక్కడ లేరు. ముంబయిలో ఉన్నారు. తాను లేకుండా సినీ కార్మికులతో సమావేశం నిర్వహించడం సరైన చర్య కాదని మంత్రి తన సన్నిహితులతో అన్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా తనకు, రేవంత్ రెడ్డికి ఓ షాడో మంత్రి గ్యాప్ పెంచుతున్నారని చెప్పినట్లు సమాచారం. ఆ షాడో మంత్రి ఎమ్మెల్యే కాదు.. ఎమ్మెల్సీ కాదు.. రాజ్యసభ సభ్యత్వం ఇవ్వలేదు.. అయితే ఓ క్యాబినెట్ ర్యాంకు పదవిస్తే ఆయన పెత్తనం రోజురోజుకు పెరిగిపోతోందని వాపోయినట్లు తెలుస్తోంది. సినీ కార్మికులతో సమావేశం నిర్వహించినప్పుడు ఆ షాడో మంత్రి అక్కడే ఉన్నారని, ఈ విషయానికి సంబంధించి కాంగ్రెస్ నాయకుల మధ్య అంతర్గతంగా చర్చ నడుస్తున్నట్లు సమాచారం.

అసలు ఇలాంటి సమావేశం ఒకటి నిర్వహిస్తున్నారన్న విషయం కూడా కోమటిరెడ్డికి తెలీదని చర్చ జరగుతుంది. గతంలో కార్మికుల సమ్మె జరిగినప్పుడు కోమటిరెడ్డి కార్మికుల పక్షాన ఉన్నారు. కార్మికుల హక్కుల్ని పరిరక్షిస్తానని అప్పట్లో మాట ఇచ్చారు. కార్మికుల సపోర్ట్ కూడా కోమటి రెడ్డికి గట్టిగానే ఉంది. ఇవన్నీ భరించలేని కొంతమంది తననీ, ముఖ్యమంత్రినీ దూరం చేస్తున్నారని, తన శాఖపై తన ఆధిపత్యాన్ని తగ్గించేలా కుట్ర పన్నుతున్నారన్నది మంత్రి ఆరోపణ. ఇదే విషయం తన సన్నిహితుల దగ్గర ప్రస్తావించినట్టు తెలుస్తోంది. దాంతో కోమటిరెడ్డికీ ముఖ్యమంత్రికీ మధ్య దూరాన్ని సృష్టిస్తున్న ఆ షాడో మంత్రి ఎవరన్నది చర్చనీయాంశంగా మారింది.అయితే జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని ఇప్పటికే డిసైడ్ అయిన హైకమాండ్.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కూడా కేబినెట్లోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఎన్నికలకు ముందు ఆయనకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. తద్వారా కొన్ని రోజులుగా ఆయన వ్యక్తం చేస్తున్న అసంతృప్తిని చల్లార్చినట్లు అవుతుందని పార్టీ పెద్దలు అనుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎల్లుండి తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. మాజీ ఎంపీ అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. దీంతో ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం మైనార్టీలు ఎవరూ లేరు. దీంతో మైనార్టీ వర్గాల నుంచి ఒకరికి మంత్రి వర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎవరిని తీసుకోవాలి? అన్న అంశంపై ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఇంత వరకు ఆ అంశం పెండింగ్ లో ఉంటూ వచ్చింది. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఫిరోజ్ ఖాన్, అజారుద్దీన్ తదితరులు కేబినెట్లో చోటు కోసం పోటీ పడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో గతంలో అక్కడ పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలైన అజారుద్దీన్ వైపు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ లో లక్షకు పైగా ముస్లింల ఓట్లు ఉన్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. ఇందులో ఒకటి అజారుద్దీన్, మరొకటి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో భర్తీ చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా మరోసారి రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి విషయంలో మరోసారి నిరాశ ఎదురైందనే చెప్పాలి. అయితే ఇప్పటికే మంత్రి పదవి ఇస్తారో లేదో మీ ఇష్టమని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హైకమాండ్ కు అల్టిమేటం జారీ చేశారు. పదవి ఇస్తామని చెప్పి పార్టీలోకి ఆహ్వానించారని.. భువనగిరి ఎంపీ సీటును గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారని ఆయన గుర్తు చేశారు. తాను ఎవరి కాళ్లు పట్టుకుని పదవి తెచ్చుకోలేనని స్పష్టం చేశారు. అలాగని తాను ఊరుకునేది లేదన్నారు. మంత్రి పదవి కోసం తాను ఎంత దూరం అయినా వెళ్తానని.. దిగజారి బతకడం తకు తెలియదన్నారు. పార్టీ మారిన వారికి, తన కంటే చిన్న వారికి పదవులు ఇచ్చారని.. తాను సీనియర్ నని చెప్పకొచ్చారు. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కాంగ్రెస్ లో సామాజిక సమీకరణాలు కలసి రావడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఇద్దరూ రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. అందులో ఒకరు ఆయన సోదరుడు కోమటిరెడ్డి రెడ్డి. అదే సమయంలో రాష్ట్ర స్థాయిలో కూడా రెడ్డి సామాజిక వర్గానికి మరో స్థానం కేటాయించే పరిస్థితి లేదు. ఒకే జిల్లాకు మూడు పదవులు అదీ ఒకే సామాజికవర్గానికి ఇవ్వడం సాధ్యం కాదు. రాజగోపాల్ రెడ్డికి పదవి కేటాయించాలంటే ఆయన సోదరుడితో రాజీనామా చేయించాలనే వాదనలు వినిపించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే కోమటరెట్టి రెడ్డి ఫ్యామిలీకి పార్టీ మధ్య గ్యాప్ పెరుగుతుందనే చెప్పాలి.. అందుకుగాను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంటకరెడ్డి లేకుండా సినీ కార్మికులతో మీటింగ్ నిర్వహించడం, మంత్రి పదవి కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రాజగోపాల్ రెడ్డిని కాదని అజారుద్దీన్ను మంత్రి మండిలిలోకి తీసుకోవడం వంటి ఘటనలు ఈ అనుమానాలను ఆజ్యం పోస్తున్నాయి.





# అజారుద్దీన్‌కు లక్కీ ఛాన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిత్వరలో మంత్రివర్గాన్ని విస్తరించబోతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెల 31న శుక్రవారం కేబినెట్ విస్తరణ ఉండే అవకాశం ఉంది. ఈ విస్తరణలో కాంగ్రెస్ నాయకుడు, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు దీనికి ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలనే వ్యూహాత్మక అడుగు వేసినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్ లో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై కొద్ది రోజులుగా రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అజారుద్దీన్‌కు మంత్రి పదవి కల్పించడం ద్వారా ముస్లింల ఆకాంక్షల తాము కట్టుబడి ఉన్నామనే సంకేతాన్ని రేవంత్ రెడ్డి ఇవ్వబోతున్నారు. ఈ నిర్ణయం వెనుక ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రభావం బలంగా కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం పరిధిలో పెద్దఎత్తున ముస్లిం ఓటర్లు ఉన్నారు. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ముస్లింల మద్దతు కూడగట్టాలనే వ్యూహాత్మక ఆలోచన ఉంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్



నుంచి పోటీ చేసి అజారుద్దీన్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

ఇక అజారుద్దీన్ కు మంత్రి పదవి వెనుక ఒక ఆసక్తికరమైన అంశం ఉంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అజారుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రతిపాదించింది. అయితే, ఈ ప్రతిపాదన ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. గవర్నర్ ఆమోదం తెలిపితేనే అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేయగలుగుతారు. అయినప్పటికీ, ఎమ్మెల్సీ కాకముందే ఆయన రేవంత్ రెడ్డి కేబినెట్ లో చేరుతున్నారు. చట్ట ప్రకారం, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తి ఆరు నెలల లోపు తప్పనిసరిగా శాసనసభ లేదా శాసనమండలి లో సభ్యత్వం పొందాలి. ఇదిలా ఉండగా, ఉపఎన్నిక నేపథ్యంలో టికెట్ ఆశించిన అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా ప్రతిపాదించి, జూబ్లీహిల్స్ టికెట్‌ను కాంగ్రెస్ అధిష్టానం నవీన్ యాదవ్‌కు కేటాయించింది.

మంగళవారం సాయంత్రం అజారుద్దీన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. వీరి సమావేశం అనంతరమే మంత్రి పదవికి సంబంధించిన నిర్ణయం వెలువడింది. అజారుద్దీన్ చేరిక తర్వాత కూడా సీఎం రేవంత్ కేబినెట్‌లో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉండనున్నాయి. మొత్తం మీద, అజారుద్దీన్‌కు మంత్రి పదవి కల్పించడం ద్వారా ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించడం, ఉపఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరుచుకోవడం అనే వ్యూహాలు దాగి ఉన్నాయి. నవంబర్ 11వ తేదీన జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పోలింగ్ జరగనుండగా.. ఇలాంటి కీలక తరుణంలో అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టనున్నారనే వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు కీలకం కానున్న నేపథ్యంలో అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వనున్నారనే వార్త ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు వచ్చే నెల 11వ తేదీన పోలింగ్ జరగనుండగా.. 14వ తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జరుగుతున్న ఈ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన సతీమణి మాగంటి సునీత బరిలో నిలవగా.. అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్ పోటీ చేస్తున్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు
## అప్రమత్తంగా ఉండాలి
**కురవి ఎస్సై గండ్రాతి సతీష్**

**కురవి, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న నిరంతర భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ విజ్ఞప్తి చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన వాగులు, వంతెనలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరూ నీటిలో మునిగిన రహదారులు, వంతెనలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. "చేపల వేటకు వెళ్లరాదు, చెరువులు మరియు వాగులు దాటరాదు, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లరాదు. తల్లిదండ్రులు పిల్లలను బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఇంకా వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి." అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1077కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మండలం వ్యాప్తంగా చెరువులు, వాగులు, వంతెనల వద్ద పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచి ప్రజల్లో జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

# తుఫానుపై సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మొంథా తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను బుధవారం ఆరా తీశారు. వరి కోతల సమయం కావడం... పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను ప్రభావం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో అధికంగా ఉండడం.. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. మొంథా తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని.. జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సీఎం సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం సూచించారు.

వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఇంజినీరింగ్ కాలేజీలకు ఝలక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఇంజినీరింగ్ సహా ఉన్నత విద్యా కాలేజీలకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఝలక్ ఇచ్చింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది. అన్ని కాలేజీల్లోనూ తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేసింది. పోలీస్, విద్యాశాఖ అధికారులు సహకారంతో తనిఖీలు చేపట్టి, నివేదిక సమర్పించాలని సూచించింది. మరోవైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపిస్తూ తెలంగాణలోని అన్ని ప్రయివేట్ ఉన్నత విద్యా సంస్థలు నవంబరు 3 నుంచి కాలేజీలను మూసివేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది.ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో సర్కారు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం, గతంలో ఇచ్చినవాటిని నెరవేర్చకపోవడంతో ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య బంద్‌కు పిలుపునిచ్చింది. దసరాకు రూ. 600 కోట్లు విడుదల చేస్తామని, కేవలం రూ. 200 కోట్లతో సరిపెట్టింది. దీపావళి నాటికి మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని చెప్పినా ఆ హామీ కూడా నెరవేరలేదు. దీంతో తక్షణమే బకాయిల విడుదలపై స్పష్టత ఇవ్వాలని కాలేజీల సమాఖ్య డిమాండ్ చేస్తోంది. దాని ప్రతినిధులు మంత్రులను కలిసి తమ సమస్యను వివరించాయి. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బంద్‌ను ఎంచుకున్నాయి. అంతేకాదు, విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరింపులకు దిగినా భయపడే ప్రసక్తేలేదని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య సమావేశంలో స్పష్టం చేశారు. భయపెట్టాలని చూస్తూ లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఛలో హైదరాబాద్ చేపడతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం 2,500 ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలు ఉండగా.. ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఎడ్, నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో 15 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో గత ప్రభుత్వ హయాంలోనే విచారణకు ఆదేశించింది. ఇటీవల ప్రయివేట్ కాలేజీల యాజమాన్యాలతో జరిగిన చర్చల్లో ఈ అంశాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ అక్టోబరు 30 విద్యా సంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలు కాలేజీలు ముందుగానే సెలవులు ప్రకటించాయి.

## కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

**కుత్బుల్లాపూర్, విశాలభారతి:**

నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి లో ఆగం పండు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డితో కలిసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దూసకగిరి, కాసాని మహేష్ ముదిరాజ్, కేశం నరేష్, రాపోలు బాలు, నవీన్, రాజేష్, మహమ్మద్ షకీల్, నందిగామ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటుకు కాంగ్రెస్ పైసలిస్తే తీసుకోండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో పాలన పడకేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం, మంత్రుల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతలకు బోనస్, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు కూడా అందట్లేదని.. ఎరువుల కోసం లైన్‌లో నిలబడి రైతు చనిపోయిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.73వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల అకౌంట్లు వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదైతే.. ఆ రైతుల గోస పట్టించుకోని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం రేవంత్ రెడ్డి నిట్టనిలువునా మోసం చేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మొత్తం మీద ఇప్పటి వరకు ఇచ్చినవి ఆరు, ఏడు వేల ఉద్యోగాలు కూడా లేవని ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని.. కానీ వారు కూడా ఒకరికి ఒకరు పొంతన లేని నెంబర్లు చెబుతున్నారంటూ సెటైర్లు వేశారు. యువతులకు స్కూటీ, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మాట తప్పిందంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ పేరు చెప్పి.. ఆ డబ్బులు పురుషుల నుంచి లాక్కుంటున్నారని గుర్తుచేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. ఆ ఇందిరమ్మ రాజ్యంలో ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా.. వేలాది ఇళ్లను నేలమట్టం చేసిందని ఆయన మండిపడ్డారు. పెద్దల ఇండ్ల జోలికి వెళ్లిన హైడ్రా.. పేదల ఇల్లు కనిపిస్తే కూల్చివేస్తోందంటూ మండిపడ్డారు. మంత్రులు జూబ్లీహిల్స్‌లో గల్లీ లీడర్లలా తిరుగుతూ.. పాలనను పక్కన పెట్టేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు.

ఇకపోతే మున్నూరు కాపులకు కేసీఆర్ ఎంతో చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. మున్నూరు కాపులకు సముచిత గౌరవం, సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ



బీసీలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మండిపడ్డారు.పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే ఇది జరుగుతుందని తాము ముందే చెప్పినా... ఈ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందంటూ ఆగ్రహం వ్యకతం చేశారు. కనీసం ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలనైనా అమలు చేయాలని...బీసీలకు ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి ఇప్పుడెందుకు ఇవ్వట్లేదో చెప్పాలని నిలదీశారు. బీసీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబితేనే వారిచ్చిన హామీలు అమలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మవద్దని హితవుపలికారు. రెండేళ్ల కిందట ఇలాంటి హామీలనే నమ్మి ప్రజలు మోసపోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజలకు డబ్బులు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పైసలు ఇస్తే తీసుకొని ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయాలని సూచించారు. వారిచ్చే రెండు వేలు తీసుకొని.. మిగితా 58వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించాలంటూ ప్రజలకు సూచించారు. మరోవైపు దొంగ ఓట్లతో అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ 12, 13వేల దొంగ ఓట్లు సృష్టించినట్లు తెలుస్తోందని.. ప్రజలు స్వయంగా బూత్‌లకు వెళ్లి ఓటు వేసి.. వాళ్లకు బుద్ధి చెప్పాలని అన్నారు. ఇది కారుకు బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలన్న ఆయన బీఆర్ఎస్‌ను గెలిపించి.. బుల్డోజర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నల్లమలలో మావోయిస్టుల సీక్రెట్ మీటింగ్

(మొదటిపేజీ తరువాయి)

కీలక నేతలు పాల్గొన్నట్లు కూడా తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ క్రమక్రమంగా బలహీన పడుతున్న నేపథ్యంలో సంస్థను పునరుద్ధరించడానికి ఒక ప్రత్యేక వ్యూహాన్ని రచిస్తున్నట్లుగా సమాచారం. కొంతమంది నాయకులకు బాధ్యతలను అప్పగించే విషయంపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా చురుకుగా ఉన్న మావోయిస్టులకు నూతన బాధ్యతలు అప్పగించేందుకు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో విభేదిస్తూ కొంతమంది పోలీసుల ఎదుట లొంగిపోతే మరికొంతమంది మావోయిస్టు పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం నల్లమలలో జరిగిన సమావేశంలో సీనియర్ మావోయిస్టులకు నాయకత్వ బాధ్యతలను అప్పగించాలని నిర్ణయం కూడా తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే దేవుజీని కేంద్ర కమిటీ అధిపతిగా, హిడ్మాను మిలటరీ కమిషన్ అధిపతిగా, కేసాను బెటాలియన్ కమాండర్ గా, దామోదర్ ను దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఇన్చార్జిగా నియమించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. గణేష్ ఓ పొలిట్ బ్యూరో సభ్యుడుగా నియమించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

**కొత్త ముఖాలను తెరపైకి**

సీనియర్ క్యాడర్ నక్సలైట్లు ప్రస్తుతం బలహీన పడుతున్న నేపథ్యంలో సంస్థ గురించి ఆందోళన పడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా మావోయిస్టు పార్టీ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు ఇటీవల జరుగుతున్న పరిణామాలే అందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. పాత కమాండర్ల మరణాలతో కొత్త ముఖాలను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని తెలిసింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని సీనియర్ మావోయిస్టులంతా లొంగిపోవడంతో వారిని మావోయిస్టు సంస్థ ద్రోహులుగా పేర్కొన్నారు. చిన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు మావోయిస్టు పార్టీ అంచలంచెలుగా ఎదిగి నేడు క్షీణించే దశకు చేరుకుంది. గత 22 నెలలుగా బస్తర్ ప్రాంతాల్లో జరిగిన ఎన్కౌంటర్లలో గగన్న అలియాస్ బసవరాజు, వికల్ప్, చలపతి, కోసా, బాలకృష్ణవంటి అగ్రశ్రేణి మావోయిస్టులు హతమయ్యారు. 29 ఎన్కౌంటర్లలో 448 మంది మృతి చెందారు. 2274 మంది లొంగిపోయారు. అయినప్పటికీ మావోయిస్టు కార్యకలాపాలకు అతిపెద్ద మిలిటరీ బెటాలియన్ నెంబర్ వన్ నిలిచిన సంస్థలో ఇంకా 300 మందికి పైగా సాయుధ నక్సలైట్లు చురుకుగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో హిడ్మా మిలిటరీ నెంబర్ వన్ కు నాయకత్వం వహించాడు. సీసీ సభ్యుడిగా మారిన తర్వాత ఆ స్థానాన్ని దేవా కు అప్పగించారు. ప్రస్తుతం బెటాలియన్ నెంబర్ వన్, నంబర్ టు, నెంబర్ 4, నెంబర్ 5 మిలటరీ బెటాలియన్లు కొనసాగుతున్నాయి.

దక్షిణ బస్తర్ లో ప్రాంతంలో చురుకుగా పనిచేసే హిడ్మా, దేవా లు లొంగిపోవడానికి సిద్ధంగా లేరని ఇటీవల రూపేష్ విడుదల చేసిన ప్రకటన ద్వారా వెల్లడవుతుంది. కానీ ఆ ప్రాంతంలోనే ప్రస్తుతం పనిచేసే మావోయిస్టులు లొంగిపోయేందుకు కోరుకుంటున్న హిడ్మా, దేవుజి భయం కారణంతో ముందుకు సాహసించలేకపోతున్నారని ఆశన్న తన ప్రకటనలో వెల్లడించారు. నార్త్ బస్తర్ ప్రాంతం నుండి మావోయిస్టు వ్యవస్థను పూర్తిగా నిర్మూలించామని బస్తర్ ఐజిపి సుందర్ రాజ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలు సైతం వెల్లడించారు. ప్రస్తుతం మావోయిస్టు చర్యలపై కేంద్ర భద్రతా బలగాలు విస్తృతంగా కూంబింగ్ లను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు మావోయిస్టులను మట్టు పెడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు సంసిద్ధులవుతున్నారు. మార్చ్ 31, 2026 మిషన్ 2026 గడువు కంటే ముందే బస్తర్ లో మావోయిస్టు రహిత ప్రాంతంగా చేయడమే కేంద్ర ప్రభుత్వ టార్గెట్ గా పెట్టుకుంది. మావోయిస్టులు లొంగి పోవడమే ఏకైక మార్గమని లేదంటే ఎన్కౌంటర్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరికలు జారీ చేశారు.



# తుఫాన్ ఎఫెక్ట్.. విద్యాసంస్థలకు సెలవులు

- మొంథా తుఫాన్‌లో భారీ వర్షా లు
- విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు
- మొంథా తుపాను తీరం దాటింది
- తీవ్ర తుపాను బలహీనపడింది
- ఖమ్మంకు 110 కిమీ దూరంలో తుఫాన్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- 3 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో తెలంగాణలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మొంథా తుపాను తీరం దాటిందని.. కాకినాడకు సమీపంలోని నరసాపురం సమీపంలో తీరం దాటినట్లుగా వాతావరణ శాఖ పేర్కొంది. ప్రస్తుతం తీవ్ర తుపాను బలహీనపడిందని.. రానున్న కొన్ని గంటల్లో అది తీవ్ర వాయుగుండంగా మారి బలహీనపడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

భద్రాచలానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో.. ఖమ్మంకు 110 కిలోమీటర్ల దూరంలో ఈ మొంథా తుఫాన్ కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా రానున్న కొన్ని గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ క్రమంలో తెలంగాణలో రానున్న రెండు రోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా తీవ్ర హెచ్చరికలు చేసింది.

ఇక బుధవారం రోజున వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్.. 3 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, పెద్దపల్లి, సూర్యాపేట, సిద్దిపేట, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

మరోవైపు.. రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. నిజామాబాద్, ఆసిఫాబాద్, కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, నల్గొండ, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. గురువారం రోజున ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలతో పాటు పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

ఇక ఇప్పటికే మొంథా తుఫాన్ ఎఫెక్ట్ తెలంగాణపై గట్టిగా ఉంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇక వరంగల్ జిల్లాలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. పర్వతగిరిలో ఏకంగా 34.8 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు.. వరి ధాన్యం కోసి మార్కెట్ యార్డులకు తరలించగా.. భారీ వర్షాలకు తడిసి ముద్దైనట్లు రైతులు వాపోతున్నారు. ఇంకా పొలాల్లో కోయని వరి పంట అలాగే ఉందని అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మొంథా తూపాను తీవ్రత దృష్ట్యా బుధవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అధికారులు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్య విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా జిల్లాల కలెక్టర్ ప్రజల్ని కోరారు.

## యాదగిరిని పరామర్శించిన నల్ల శ్రీరామ్

**దేవరుప్పల, విశాలభారతి:**

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,మన్ పహాడ్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జోగు యాకన్న తండ్రి జోగు యాదగిరి అనారోగ్యానికి గురై జిల్లాకేంద్రంలోని శ్రీ సాయికృష్ణ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఈ రోజు హాస్పిటల్‌కి వెళ్ళి ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట నల్లకుంట గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు శ్రీనివాస్,నాయకులు బానోతు భాస్కర్,బానోతు కిరణ్ తదితరులున్నారు.



## చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్



- అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలో ఉన్న ఊర చెరువును జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించడం జరిగింది.చెరువులోకి వస్తున్న వరద నీటిని పరిశీలించి అనంతరం ఆర్డిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమును నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు మూడు రోజులు బారి నుండి అతి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని అధికారులు అందరూ అప్రమత్రంగా ఉండాలని, పనులను దగ్గర ఉండి పరిశీలించాలని సూచనలు చేయడం జరిగింది.అనంతరం చౌటుప్పల్ ఊర చెరువును,అలుగును పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి,ఇరిగేషన్ ఈ మనోహర్,డిఈ రాజవర్ధన్ రెడ్డి,తాసిల్దార్ మీరాబాయి,చౌటుప్పల సిఐ మన్మధ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సుధాకర్ రావు,బాణాల రామ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు మోగుదాల రమేష్ గౌడ్,స్థానిక నాయకులు,అధికారులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నవంబర్ 2న నాయకపోడు యువ గర్జన



### తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

**దమ్మపేట, విశాలభారతి:**

దమ్మపేట మండలంలో నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాధ్యక్షుడు సోమనేని శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ, నవంబర్ 2న మండల కేంద్రంలో జరగనున్న "నాయకపోడు యువ గర్జన" పేరుతో జరుగుతున్న కార్యక్రమానికి రిజిస్టర్ నంబర్ 141/2015తో నమోదైన నాయకపోడు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొంతమంది స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం ఇతర గిరిజన సంఘం ఆధ్వర్యంలో నాయకపోడు దేవతల ఊరేగింపు పేరుతో నాయకపోడు జాతిని మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ తప్పుడు ప్రచారాలకు భ్రమ చెందవద్దని, నాయకపోడు కుల పెద్దలు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత సంఘం ఏకతకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్యదర్శి తాళదుర్గయ్య, భోగి వీరస్వామి, పూసి గోవర్ధన్, కొయ్యల అచ్యుతరావు, రావుల శ్రీనివాసరావు, అల్ల జంగం, గడ్డం వెంకటేశ్వరరావు, పాశం ప్రసాద్, కాసిన వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రాశా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షంలోనూ కాంగ్రెస్ ప్రచారం జోరు

### నవీన్ యాదవ్ పక్షాన ప్రజల మద్దతు వెల్లువ



**విశాలభారతి, పెద్ద అంబర్పేట్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసఫ్‌గూడ డివిజన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం కురిసిన జోరు వర్షాన్ని లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రచారం కొనసాగించారు.ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కూడా ప్రచారంలో పాల్గొని ప్రజలను కలిశారు. వర్షం మధ్యలోనూ కాలనీల వారీగా ఇంటింటికి తిరుగుతూ నవంబర్ 11న జరగబోయే ఉప ఎన్నికల్లో సీరియల్ నెంబర్ 02 పై ఉన్న చేతి గుర్తు కు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ప్రచార బృందం పలు కాలనీల్లో ప్రజలతో మమేకమవగా, స్థానికులు కాంగ్రెస్ అభ్యర్థికి విస్తృత మద్దతు తెలుపుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి

### రేపాల మదన్మోహన్



**చౌటుప్పల్, విశాలభారతి:** మహిళలు సర్వతోముఖ అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని గవర్నర్ లయన్ రేపాల మదన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ ఆధ్వర్యంలో మహిళా సాధికారత నేపథ్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ లయన్ రేపాల మదన్మోహన్, స్వామి రామానంద తీర్థ చైర్మన్ ఎన్ కిషోర్ రెడ్డి లు చేతులమీదగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ,రామానంద తీర్థ సంస్థ ద్వారా జరుగుతున్న పలు శిక్షణల గురించి వివరించారు.బ్లౌజ్ లు కుట్టడంలో చాలా మెలుకువలు శిక్షణలో నేర్చుకోని.కుటుంబంలో ఆధారపడకుండా స్వావలంబన నైపుణ్యం సాదించాలని, స్త్రీ ఆర్థిక సామాజిక స్వావలంబన మన కలిగి ఉంటుందో ఆ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. అనేక రంగాలలో మహిళలు సాధికారత సాధించాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ పోలోజి శ్రీనివాస్ చారి,సమస్త చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా,క్లబ్ అధ్యక్షులు తిరందాసు జగన్నాథ్,కార్యదర్శి అతహర్ పాషా,కోశాధికారి సిలువేరు మంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ని సన్మానించిన గద్దల రమేష్



**పాల్వంచ, విశాలభారతి:** అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఎస్సీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ గా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం నియమించిన సందర్భంగా,టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ బుధవారం హైదరాబాద్ లోని అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఈ సందర్భంగా ప్రీతం కు గద్దల రమేష్ శుభాకాంక్షలు తెలిపి పూలబొకే అందించి శాల్వతో సన్మానించారు.ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ నాగరిగారి ప్రీతం జాతీయ కాంగ్రెస్ లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం

### రూ. 20 వేలు సాయం అందించిన నందివనపర్తి మాజీ సర్పంచ్ డా. రాజునాయక్



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి నందివనపర్తి మాజీ సర్పంచ్ డా. వర్త్యవత్ రాజు నాయక్ ఆర్థిక సాయం అందించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన అవనీల ధనమ్మముత్యాలు దంపతుల రెండవ కుమార్తె వివాహానికి డా. రాజునాయక్ రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ఆడబిడ్డలకు విఆర్ ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని నిరుపేదలకు ఆపద సమయంలో సహాయం చేయడంలో ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పగిల్ల శ్రీనివాస్, కొండాపురం జంగయ్య పాల్గొన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య

### చెట్టుకు ఉరి వేసుకొని సూసైడ్

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన మంకు నాగరాజు అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకే గ్రామానికి చెందిన పంబాల నందిని (19), మంకు నాగరాజు (22) ఇద్దరు ప్రేమించుకున్నారు. కాగా సోమవారం నందిని తన ఇంట్లో ఉరేసుకుని చనిపోయింది. దీంతో మంగళవారం ఆమె కుటుంబ సభ్యులు బంధువులు కలిసి మంచాల పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అనంతరం బాధిత కుటుంబానికి పరిహారాన్ని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదిలా ఉండగా నందిని మృతి చెందిన విషయం తెలుసుకున్న నాగరాజు ఆరుట్ల నుండి వెళ్లి ఆగపల్లి గ్రామంలోని తన అక్క వద్ద ఉన్నాడు. ఆ తర్వాత మనస్థాపానికి గురైన నాగరాజు ఆగపల్లీ నుండి పెత్తుళ్ల గ్రామం వెళ్ళే రోడ్ లో ఓ చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గొర్రెల కాపరి మృతదేహాన్ని చూసి స్థానికులకు తెలపడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి



### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జనగామ జిల్లా ఇన్చార్జి బోడ సునీల్

**దేవరుప్పల, విశాలభారతి:**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయి గారు మీద జరిగిన దాడిని ఖండిస్తూ, ఈరోజు దేవరుప్పుల మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జనగామ జిల్లా ఇంచార్జీ బోడ సునీల్ మాదిగ గారు పాల్గొని మాట్లాడుతూ, ఈ దాడి జరిగి నేటికీ 20 రోజులు అవుతుంది ఇంత వరకు అరెస్టు చేయలేదు ముఖ్యంగా దళితులు ఉన్నత స్థానంలో కూర్చోవడం కొంతమంది అగ్రకులాలకు గిట్టడం లేదు అందుకే ఈ దాడికి పాల్పడ్డారు ఇది చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడి కాదు యావత్తు న్యాయ వ్యవస్థ దళిత సమాజంపై జరిగిన దాడిగా భావించుకుంటాం అన్నిటికన్నా భారత రాజ్యాంగ మీద దాడి జరుగుతుంది ఈ ఇలాంటి ఘటన పునరావతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు తక్షణమే ఢిల్లీ ప్రభుత్వం రాకేష్ కిషోర్ అరెస్టు చేయాలని నవంబర్ 1న హైదరాబాద్ లో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనకు రఘునాథపల్లి మండలంలో అన్ని గ్రామాల నుంచి ప్రజలను చైతన్యం చేసి వాహనాలు ఏర్పాటు చేసుకొని హైదరాబాద్ తరలివచ్చి విజయవంతం చేయాలి ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ దేవరుప్పుల మండల అధ్యక్షుడు పడమంటి నర్సింహ్మా మాదిగ విహెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి నాయక్ ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు కొంగరి రాములు మాదిగ జోగు రవి మాదిగ ఉప్పుల యాకయ్య మాదిగ చింత యాకుబ్ మాదిగ జోగు కొమురయ్య చింత పరుశు రాములు మాదిగ బోడ వినోద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి



### మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

**గండిపేట్, విశాలభారతి:**

ప్రజలు బీఆర్ఎస్ పాలనలోనే సంతృప్తి చెందారని మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. మణికొండ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు సముద్రాల వాణి, ముత్తారం గ్రామ మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రంలో తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పరిపాలన దక్షతకు ఆకర్షితులై కేటీఆర్ ను ఆదర్శంగా తీసుకొని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజలు ఎంతో సానుకూల స్వభావంతో ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నేడు పాఠశాలలకు సెలవు

### భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**చౌటుప్పల్, విశాలభారతి:**

నిన్నటి నుండి ఎడతెరుపు లేకుండా భారీగా వర్షాలు కురుస్తున్నాయి.ఈ సందర్భంగా వర్ష ప్రభావం దాదాపు ఇంకా రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు ఉన్నందున యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాల మేరకు నేడు అన్ని ప్రభుత్వ,స్థానిక సంస్థల మరియు ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందనీ యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలపడం జరిగింది.

## పోచమ్మ కుంట చెరువు కట్ట అభివృద్ధి కై ప్రత్యేక ప్రణాళికలు



### మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, అధికారులతో కలిసి పరిశీలన

**మేడిపల్లి, విశాలభారతి:**

పీర్జాదిగూడ నగరంలోని ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారబోతున్న పోచమ్మ కుంట చెరువు అభివృద్ధి పనుల కోసం *మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్* అధికారులతో కలిసి చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల విహారయాత్రకు, పర్యావరణ పరిరక్షణకు, నగర సుందరీకరణకు చెరువుల అభివృద్ధి ఎంతో అవసరం. అందుకే చెరువును అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. హెచ్ఎండిఏ (HMDA) నిధులలో ఒక కోటి 33 లక్షల రూపాయల వ్యయంతో* చెరువు కట్ట వెంబడి ఫుట్ పాత్ నిర్మాణం, బ్యూటిఫికేషన్, కట్ట బలపరచడం, లైటింగ్ సదుపాయాలు, మొక్కల నాటకం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, D. E సాయి నాద్ గౌడ్ గారు. A. E గారు. టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు స్థానిక నాయకులు, కాలనీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాలభారతి:**

మండలం లోని అశోక్ నగర్ లో గల గిరిజన బాలుర వసతి గృహమును బుధవారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మితంగా తనిఖీ చేసారు. విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూ గురించి ఆరా తీశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు, సౌకర్యాల గురించి స్వయంగా విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, కావాల్సిన ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆహారాన్ని పరిశీలించారు. స్వయంగా తరగతి గదులకి, విశ్రాంతి గదులను, వంటశాల,స్టోర్ రూములకు వెళ్లి పరిశీలించారు. వసతి గృహాల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను ధ్రువీకరించి, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు కల్పించే వసతి సౌకర్యాలను హాస్టల్ సిబ్బంది తెలిపారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ చార్జెస్ పెంచడం జరిగింది అని తెలుపుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉన్నతమైన విద్య, పౌష్టిక ఆహారం, వసతులు విషయంలో రాజీ పడకుండా నిధులను మంజూరు చేస్తుందని విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను అవరోహించాలి అని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలు అవకతవకల వేదికగా!

- గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు
- అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో అవకతవకలు
- దళితబంధు నిధులతో వడ్డీ వ్యాపారాలు
- దొంగ పత్రాలతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలు

**అశ్వారావుపేట, విశాలభారతి:**



ప్రజల సంక్షేమార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల నిధులు కొన్ని ప్రాంతాల్లో ఉద్దేశిత లక్ష్యాలకు విరుద్ధంగా వినియోగించబడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దళితబంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పథకాల అమలులో తీవ్ర అవకతవకలు జరిగినట్లు సమాచారం. దళితబంధు పథకం కింద నియోజకవర్గంలో 2,346 మంది లబ్ధిదారులు నమోదు అయ్యారు. వీరిలో అశ్వారావుపేట మండలంలో 1,245 మంది, దమ్మపేట మండలంలో 1,101 మంది ఉన్నారు. అయితే కొందరు లబ్ధిదారులు పథకం కింద పొందిన నిధులను ఉద్దేశిత ప్రయోజనాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం దళితుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పథకాన్ని ప్రవేశపెట్టినా, కొందరు రాజకీయ పలుకుబడి ఉన్నవారు దుర్వినియోగం చేశారని ప్రజలు పేర్కొంటున్నారు. వ్యాపారాలు, స్వయం ఉపాధి స్థాపించాల్సిన చోట కొందరు ఆ నిధులను అప్పులు తీర్చడానికి, భూములు కొనుగోలు చేయడానికి ,వడ్డీ వ్యాపారాలకు ఉపయోగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దమ్మపేట మండలంలో కొందరు వ్యాపారాల పేరుతో నిధులు పొందినా, వాస్తవంగా ఆ వ్యాపారాలు ప్రారంభించకపోవడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది. పథకం ఉద్దేశం చెడిపోవడం వల్ల నిజమైన దళిత కుటుంబాలు నష్టపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ లక్ష్మి పథకం కింద 4,812 మంది లబ్ధిదారులు నమోదు అయ్యారు. వీరిలో అశ్వారావుపేట మండలంలో 2,535 మంది, దమ్మపేట మండలంలో 2,277 మంది ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది ఉద్యోగులు పత్రాల ప్రాసెసింగ్ పేరుతో 30 శాతం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పెళ్లయి సంవత్సరాలు గడిచిన మహిళల పేర్లతో దొంగ పత్రాలు సృష్టించి, అనర్హులకు లబ్ధి చేకూర్చినట్లు ఆధారాలు, పంచాయతీ ఉద్యోగులు, ప్రైవేటు మధ్యవర్తులు ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నట్లు స్థానిక సమాచారం సూచిస్తోంది. షాదీ ముభారక్ పథకం కింద 1,109 మంది లబ్ధిదారులు నమోదు అయ్యారు. వీరిలో అశ్వారావుపేట మండలంలో 585 మంది, దమ్మపేట మండలంలో 524 మంది ఉన్నారు. ఈ పథకంలోనూ తప్పుడు పత్రాలు సమర్పించి లబ్ధి పొందిన ఘటనలు చోటు చేసుకున్నాయని ప్రజలు చెబుతున్నారు. దమ్మపేట మండల కార్యాలయాలు ప్రజా పథకాల అవకతవకలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి.సంబంధిత అధికారులు, తప్పుడు పత్రాలు సృష్టించడం లేదా ప్రభుత్వ నిధులను వేరే అవసరాలకు వినియోగించడం నేరమని హెచ్చరిస్తున్నారు. IPC సెక్షన్ 409, 420, 468, 471, 120B ప్రకారం దోషులకు జైలు శిక్షలు, జరిమానాలు విధించాలని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ నిధులను పక్కదారి మళ్ళించి వడ్డీ వ్యాపారాలకు దళితభందు పథకం వేదికగా మారిందని ఆరోపణ ఉంది. ప్రజలు, ఈ అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజమైన లబ్ధిదారులకు మాత్రమే నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ పథకాల నిధులను దుర్వినియోగం చేసినవారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజల కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకు వేదికలుగా మారితే, దాని మూల ఉద్దేశం వృథా అవుతుంది. పథకాల పారదర్శకతను కాపాడి, ప్రతి రూపాయి నిజమైన లబ్ధిదారుల దాకా చేరేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# నిరసన దీక్షకు సంగీబావం తెలిపిన న్యూ డెమోక్రసీ

## కార్యదర్శి గౌని ఐలయ్య

**బయ్యారం, విశాలభారతి :**

గత 40 రోజుల క్రితం బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి పై జరిగిన దాడికి పాల్పడిన దొషులని చట్ట ప్రకారం శిక్షించాలని, భౌతిక దాడిని నిరసిస్తూ న్యాయ పోరాటంకై బయ్యారం బస్టాండ్ సెంటర్ లోని డా. బాబా, సాహెబ్ అంబేత్కర్ గారి విగ్రహం ముందు 3 వ రోజు,రిలే నిరసన దీక్షకు సంగీబావం, మద్దత్తు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసి మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ.. బయ్యారం మండలంలో గత కొంతకాలంగా భౌతిక దాడులు చేస్తూ ప్రజల్లో ఆందోళన, అశాంతిని కలిగిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గతంలో అధికార పార్టీ వారు ప్రతి పక్ష పార్టీ నాయకులపై దాడులు చేసే పరిస్థితి ఉండేది కానీ ఇప్పుడు సొంత పార్టీ నాయకుల పైనే అవినీతిని ఒంటెద్దు పోకడలను, స్వార్థ రాజకీయాలు చేస్తున్న వ్యక్తులను ప్రశ్నించిన పాపానికి సొంత పార్టీ నేతలపైనే భౌతిక దాడులకు తెగబడడం క్షమించరాని నేరమని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఏపూరి వీరభద్రం, రాష్ట్ర కమిటీ న్యూ డెమొక్రసీ సభ్యులు కార్యదర్శి, తుడుం వీరభద్రం, కొదుమూరి నాగేశ్వరావు, ఐఎఫ్టియు నాయకులు నేతగాని రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్పి పురం మాజీ సర్పంచ్ పోలిపోయిన వెంకటేశ్వర్లు తొట్టి అశోక్, బాలాజీ పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరభద్రం బండి యాదగిరి గుగులోత్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు, డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యేకు కాలనీవాసుల విజ్ఞప్తి
- 8 నెలలు గడుస్తున్న పట్టించుకోని కమిషనర్

**విశాల భారతి, పెద్ద అంబర్పేట్:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మూడో వార్డు పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీ ప్రజలు గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని ప్రధాన రహదారి పై గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావడానికే ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీ అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ — "వర్షం పడ్డప్పుడల్లా రహదారి గుంతలమయమై నీటితో నిండిపోతుంది. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లడానికే కష్టపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా కాలనీలో ఎక్కడ చూసినా నీరు నిలుస్తోంది" అని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు సమస్యలను వివరించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాలనీవాసుల వద్దకు వస్తున్న నాయకులు, సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారని వారు పేర్కొన్నారు.

# కష్టకాలంలో కనువిందు చేసిన సేవా మనిషి గార్లపాటి భరద్వాజ్ రెడ్డి

- రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు ఆహార సహాయం
- వర్షం, చలిని లెక్కచేయని మానవతా దీప్తి
- ఆకలితో ఉన్నవారికి అన్నదాతగా భరద్వాజ్ రెడ్డి

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ రైల్వే స్టేషన్లో భారీ వర్షాల కారణంగా కోణార్క్ ఎక్స్ప్రెస్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన కురవి మండలం (విలేజ్) గుండ్రాతిమడుగు గ్రామవాసి, కురవి మండలం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి తన తోటి నాయకులతో, స్నేహితులతో కలిసి వెంటనే రైల్వే స్టేషన్కు చేరుకున్నారు. "ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు పక్కన నిలబడి సహాయం చేయడం మన పౌర ధర్మం" అంటూ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు ఆహార ప్యాకెట్లు, స్నాక్స్, వాటర్ బాటిల్స్, అరటి పండ్లు పంపిణీ చేస్తూ వారిని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండ్రాతిమడుగు కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు తురక వెంకటేష్, మాచర్ల హరీష్, జంగిల్ సాయి, పత్తి నరేష్, గుప్ప మురళి, తురక రమేష్, మాచర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు. వర్షం, తడిసిన వాతావరణం మధ్యన కూడా యువకులు సేవా కార్యక్రమం నిర్వహించడం ప్రశంసనీయం. ప్రయాణికులు "ఇలాంటి సమయంలో మాకు అండగా నిలిచిన భరద్వాజ్ రెడ్డి కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు" తెలిపారు. రైల్వే అధికారులు కూడా యువతలో ఉన్న ఈ సేవా తపనను అభినందించారు. ఈ ఘటన భరద్వాజ్ రెడ్డి మానవతా భావనకు, సమాజం పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది.

## హరీష్ రావును పరామర్శించిన కేంద్రమంత్రి బండి సంజయ్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** మాజీ మంత్రి హరీష్ రావును కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున కన్ను మూసిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం బిజెపి నేతలు కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హరీష్ రావు నివాసం ఉంటున్న మణికొండలోని ఉప్పలగూడలో ఉన్న క్రీన్స్ విల్లాస్ లో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మనోధైర్యం కోల్పోవద్దని హరీష్ రావుకు సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భర్త మిస్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఊట్పల్లి గ్రామానికి చెందిన బండ్లమూడి రాందాస్ (40) గత కొన్ని సంవత్సరాల నుంచి ఆరోగ్యం బాగోలేక ఇంట్లోనే ఉండేవాడు కానీ ఒక సంవత్సరం క్రితం నుంచి అతనికి మతిస్థిమితం కోల్పోవడంతో తన భార్య రమాదేవి ఇంట్లోనే ఉంటూ తన ఆరోగ్య పరిస్థితిని చూసుకుంటూ ఉండేది ఈరోజు ఉదయం నుంచి రాందాస్ ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి బయటకి వెళ్లిపోవడం జరిగింది ఈ విషయం గమనించిన రమాదేవి తన భర్త గురించి చుట్టుపక్కల వారి దగ్గర, బంధువుల దగ్గర, స్నేహితుల దగ్గర వెతకగా ఆచూకీ దొరకలేదు అలాగే తన మొబైల్ కు కాల్ చేయగా మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుందన్నడంతో వెంటనే రమాదేవి శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది శంషాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బత్తుల విప్లవ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**చౌటుప్పల్, విశాలభారతి:** నిన్నటి నుండి రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ముఖ్యంగా కరెంటు స్తంభాలను,విద్యుత్ వైర్లను,ట్రాన్స్ఫార్మర్లను తాకకండి.మ్యాన్ హోల్స్,డ్రైనేజీలను చూసుకొని నడవండి.ఉధృతముగా ప్రవహించే చెరువులు,వాగుల వద్దకు వెళ్ళకండి.వ్యవసాయ,తదితర పరిసర ప్రాంతాల్లో విష సర్పాలతో జాగ్రత్తగా ఉండండి.పాత గోడలు,పాత ఇండ్లు కూలిపోయే స్థితిలో ఉంటే అక్కడికి వెళ్ళకండి.ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు వెళ్ళకండి. అని అయన ప్రజలకు ఒక ప్రకటనలో సూచించారు.

## జంట జలాశయాల నుంచి భారీగా నీటి విడుదల



**రాజేంద్రనగర్, విశాలభారతి :** భారీగా వర్షాలు కురుస్తుండటంతో జంట జలాశయాల నుంచి నీటిని కిందికి వదులుతున్నారు. హిమాయత్ సాగర్ 6 గేట్లను, ఉస్మాన్ సాగర్ నాలుగు గేట్లను పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హిమాయత్ నగర్ నుంచి 3,963 క్యూసెక్కులు, ఉస్మాన్ సాగర్ నుంచి 2,240 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా వచ్చే వరద నీటితో అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రహదారిపై ఉన్న బ్రిడ్జ్ ధ్వంసం అయ్యింది వీటి వల్ల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హిమేష్ సాగర్ నుంచి తరచూ వరద నీరు భారీగా వస్తుంది. దీంతో ఎగ్జిట్ నెంబర్ 17 ఎంట్రీ సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డు బ్రిడ్జి వరద దాటికి ధ్వంసం అయింది.ఎగువ ప్రాంతమైన రంగారెడ్డి, వికారాబాద్ ప్రాంతాలలో తుఫాను ప్రభావంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు జలాశయాలకు భారీగా వరద నీరు వస్తుంది.

## తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



**అశ్వారావుపేట, విశాలభారతి:** మొంథా తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణలోకి తీసుకొని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని, పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. పంట నిల్వ కేంద్రాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, తేమ వల్ల నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఏ అవాంతరం వచ్చినా వెంటనే స్పందించాలని సూచించారు. అతిభారీ వర్షాలు, గాలివానలు కారణంగా రహదారులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, డ్రైనేజీలు, విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రజలతో సమగ్ర సమన్వయం కొనసాగిస్తూ తుఫాను ప్రభావాన్ని పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

## మంచినీరు రాని బిల్లులకు మినహాయింపు కోరుతూ వినతిపత్రం

**రాజేంద్రనగర్, విశాలభారతి:**



బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ మరియు గంధంగూడ కాలనీవాసులు గత మూడేళ్లగా మంచినీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి నీటి పైపు లైన్లు వేయడం జరిగింది కానీ నీటిని వదలడం మర్చిపోయారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ కొత్తగా ఏర్పడిన రిజర్వాయర్ పైపుల ద్వారా ఈ రెండు కాలనీలకు మంచినీటిని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో అందిస్తున్నారు కానీ ఈ రెండు కాలనీవాసులకు ఇంతకుముందు నిర్మించిన పైపుల ద్వారా వచ్చే వాటికి నీటి బిల్లులు రావడం జరిగింది వాటి వలన గత మూడు సంవత్సరాల నుంచి నీవే రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది కానీ వాటికి బిల్లులను అధికారులు వేస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక మేయర్ కు కాలనీవాసులు వినతి పత్రాన్ని అందించారు పైప్ లైన్ వేసిన నీటిని వదల లేదని దానికి బిల్లులు కట్టమని అధికారులు కోరుతున్నారని కానీ రాని నీళ్లకు బిల్లులు ఎలా కడతారని వాటిని వెంటనే మాఫీ చేయాలని కాలనీవాసులు వినతి పత్రాన్ని అందించారు.

## వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**విశాల భారతి, పెద్ద అంబర్పేట్:**

గత నెలలో పడిన భారీ వర్షాల వల్ల హయత్ నగర్ డివిజన్లోని పద్మావతి కాలనీలో వరద నీటి ప్రవాహానికి ధ్వంసమైన భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్ మరమ్మతులు దాదాపు పూర్తి కావడం మరలా బుధవారం రోజు తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షానికి ఎగువ నుండి వస్తున్న నీటి ప్రవాహానికి మరలా భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్, సీసీ రోడ్ కుంగిపోవడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి భారీ వర్షం లోను సంబంధిత జలమండలి, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాల పట్ల ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని,హయత్ నగర్ డివిజన్ కు ఎగువ నుండి వస్తున్న భారీ వరద నీటిని వరద నిట్టి కాలువలోకి మరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్స్, వరద నిట్టి కాలువల వద్ద వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని వారు తెలిపారు, అదేవిధంగా వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా పద్మావతి కాలనీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్ మరమ్మతులను పూర్తి చెయాలని వారు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈ ఈ రమేష్ బాబు,డి ఈ దామోదర్, జలమండలి డి జి యం రాజ్ గోపాల్, ఏ ఈ హేము నాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## శిశు విక్రయాలు చట్టరీత్యా నేరం

**సిడిపిఓ లావణ్య కుమారి**



**మునుగోడు, విశాలభారతి:** శిశు విక్రయాలు జరుగుతే చట్టరీత్య నేరమని అందుకు చర్యలు ఉంటాయని మునుగోడు ఐసిడిఎస్ సిడిపిఓ లావణ్య కుమారి అన్నారు. బుధవారం మండలంలోని మునుగోడు, కమ్మగూడెం 2 , చీకటి మామిడి అంగన్వాడి సెంటర్ పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీల గృహాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లింగ వివక్షత , అక్రమ దత్తత గురించి గర్భిణీ స్త్రీలకు కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ వెంకటమ్మ, సూపర్వైజర్ శివేష, అంగన్వాడి టీచర్లు పి. పద్మ, కె. విక్టోరియా, పి. విజయ, జె. శోభ పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్**

**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంతెనలు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎవరూ నీట మునిగిన రోడ్లు, వంతెనలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అలాగే చేపల వేటకు వెళ్లరాదని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటకూడదని, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లరాదని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాబోయే రోజుల్లో కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు జరగకుండా వంతెనలు, చప్టల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నదని, అధికారులు మరియు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొరకు పరిశీలన

**విశాలభారతి, పోతంగల్,** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోపి ఎస్ ఆర్ నగర్ వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రూ.200 కోట్లతో నిర్మించనున్న ఈ స్కూల్ కోసం బుధవారం సాయంత్రం టీఎస్ ఈడబ్ల్యూ ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్కూల్ నిర్మించబోయే స్థలం బౌండరీలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్టు తెలియచేసారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు

**జూబ్లీహిల్స్, విశాలభారతి:**



నియోజకవర్గంలోని బోరబండ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ సిరాజ్జుద్దీన్, ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం మంత్రి వర్యులు సీతక్క పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై, నియోజకవర్గ అభివృద్ధిలో కూడా భాగస్వాములం అవుదామని నిర్ణయించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సయ్యద్ సిరాజ్జుద్దీన్ తెలిపారు.నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా *రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క గారు మాట్లాడుతూ..* రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రతి వర్గానికి న్యాయం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన పథకాలు, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, మైనారిటీలకు మేలు చేసే విధంగా రూపొందించబడ్డాయి. బోరబండ ప్రాంతం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని పేర్కొన్నారు.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..* ముఖ్యమంత్రి అభివృద్ధి దృక్పథం వల్లే అన్ని వర్గాలు కాంగ్రెస్ వైపు ఆకర్షితమవుతున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజేతగా నిలిపి, అభివృద్ధి యాత్రకు తోడ్పడాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, కాలనీ వాసులు, స్థానిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కొత్తగా పార్టీలో చేరిన నాయకులను ఘనంగా ఆహ్వానించారు.

## నష్టపోయిన రైతాంగాన్ని, పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి

**అఖిల భారత రైతు–కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు**

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు "మొంథా తుఫాను కారణంగా రైతాంగం, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అనేక గ్రామాల్లో రహదారులు ధ్వంసమైపోవడం, చెరువులు పొంగిపోవడం, పంట పొలాలు నీట మునిగిపోవడం వల్ల ప్రజల జీవన విధానం పూర్తిగా దెబ్బతిన్నది. పంట ఉత్పత్తులు తడిసి ముద్దవడంతో రైతులు ఆర్థికంగా కృంగిపోతున్నారు. కొన్నిచోట్ల వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నాశనం కాగా, మిర్చి పంటలు నేలవాలికుళ్లిపోతున్నాయి. కొందరు రైతులు తమ పశువులు, గొర్లు, మేకలు కూడా కోల్పోయారు. పేదల గృహాలు కూలిపోయి కుటుంబాలు బహిరంగ ప్రదేశాల్లో ఆశ్రయం పొందుతున్నాయి." అని పేర్కొన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలపై జరిగిన నష్టాన్ని యుద్ధ ప్రాతిపదికన అంచనా వేసి, తక్షణమే రైతులకు నష్టపరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన పంట ఉత్పత్తులను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే సత్వరంగా కొనుగోలు చేయాలని, వాటిని గిడ్డంగుల్లో లేదా ప్రభుత్వ అనుకూల ప్రదేశాల్లో ఆరబెట్టుకునే సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే రైతులకు ఉచితంగా టర్పో పట్టా సీట్లు అందజేయాలని, భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల ప్రభావాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బండపల్లి వెంకటేశ్వర్లు తమ ప్రకటనలో ఇంకా పేర్కొంటూ – "రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కృషి చేసి రైతాంగాన్ని, పేద ప్రజలను తక్షణమే ఆదుకోవాలి. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సాయం వంటి అత్యవసర సేవలు అందించాలి" అని విజ్ఞప్తి చేశారు.

## సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్



**మేడిపల్లి, విశాలభారతి:**

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025 లో భాగంగా డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శ్రీమతి శిఖా గోయల్,ఐపీఎస్ ఆదేశానుసారం హైదరాబాదు రూరల్ యూనిట్, రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నాడు రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో శాంతి వనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అటవీ అధికారి ఎం వేణు మాధవ్ మాట్లాడుతూ అవినీతి రహిత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలలో విజిలెన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ప్రభుత్వ ధనం వృధా కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ అటవీ శాఖకు సహకారం అందించాలని ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పనులు విజయవంతంగా చేయగలుగుతామని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి, శాంతి వనం కి వచ్చిన వాకర్స్ తో మరియు అటవీ, బోడుప్పల్ మున్సిపాలిటీ సిబ్బందితో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కీసర ఫారెస్ట్ రేంజ్ అధికారి జే విష్ణువర్ధన్ రావు, ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శరత్ చంద్ర, విజిలెన్స్ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, శాంతి వనం కి వచ్చే వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మధుయాష్కికి జ్ఞాపికను అందజేసిన బొడ్రాయి ఉత్సవ సమితి



**విశాలభారతి, ఎల్బీనగర్:** హయత్ నగర్ గ్రామ బొడ్రాయి ఉత్సవ సమితి ప్రతినిధులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని కలిశారు. బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు సహకారం అందించిన మధుయాష్కిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ ప్రతినిధులందరినీ మధుయాష్కి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి కన్వీనర్ కళ్లెం రవీందర్ రెడ్డి , కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెనగౌని రవీందర్ గౌడ్,ప్రతినిధులు నక్క దర్శన్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ , తాటి చెట్టు సునీల్ గౌడ్ , సిహెచ్ రమేష్, భాస్కర్ యాదవ్ గ, వెంకటేష్ గౌడ్ , శంకర్ రెడ్డి బెన్నూరు సేలు , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



**విశాలభారతి, పెద్ద అంబర్‌పేట్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గూడం నాగేశ్ తో కలిసి బోరబండ డివిజన్ పరిధిలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో మార్పు రావాలి. ప్రజలను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెక్ పెట్టాలంటే బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డిని గెలిపించాలి. నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కమలం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థిని విజయం వైపు నడిపించండి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, గోవిందా చారి, ఎర్రవెల్లి సత్యనారాయణ, సూర్య నాయక్, శంకర్ నాయక్, మధు, బీజేవైఎం అధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దతండా శ్రీరామాలయంలో వైభవంగా ఆకాశ దీప దర్శనం

- **పురోహితులు అరిపాక సతీష్ ఆచార్యుల నేతృత్వంలో వేదమంత్రాలతో ఘన ఆరాధన**
- **జై శ్రీరామ్... భక్తిశ్రద్ధలతో ఊరంతా ఆత్మీయ వాతావరణం**



**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండా శ్రీరామాలయంలో బుధవారం జరిగిన ఆకాశ దీప దర్శనం భక్తి వాతావరణంలో అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురోహితులు అరిపాక సతీష్ ఆచార్యులు వేదమంత్రాలతో, శ్రావ్యమైన ఘంటానాదాలతో ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీరాముడి విగ్రహం ముందు వేదపండితులు మంగళహారతులు అందించి, అనంతరం ఆకాశ దీపాన్ని ఆచార్యులు స్వయంగా వెలిగించారు. దీప కాంతులు ఆకాశంలో మెరుస్తుండగా భక్తులు "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయం మారుమోగింది. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని శ్రద్ధాభక్తులతో ఆరాధనలు చేశారు. మహిళలు దీపారాధనలో పాల్గొని పూలతో, వేపాకు, కొబ్బరికాయలతో పూజలు చేశారు. ఆచార్యులు అరిపాక సతీష్ భక్తులకు సంస్కృత శ్లోకాలు, శ్రీరాముని మహిమ గురించి వివరిస్తూ, "దీపం వెలిగే చోట చీకటి నిలవదు – మన హృదయంలో భక్తి దీపం వెలిగితే కష్టాలు దూరమవుతాయి" అని ప్రసంగించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలను పంపిణీ చేశారు. పిల్లలు, యువతులు దీపోత్సవాన్ని ఆనందంగా ఆస్వాదించారు. గ్రామ పెద్దలు ఆచార్యుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ, ప్రతి సంవత్సరం ఇలాంటి భక్తి కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ నాయకుల రిలే నిరసన దీక్ష

- **వర్షం కురుస్తున్నా వెనక్కి అడుగు లేదు**
- **న్యాయం కోసం కాంగ్రెస్ నాయకుడి పోరాటం జోరు**
- **అంబేద్కర్ విగ్రహం ముందు నాయిని శ్రీనివాస్ రెడ్డి,**
- **చల్లా గోవర్ధన్ రిలే నిరాహార దీక్ష**



బయ్యారం, విశాలభారతి: బయ్యారం పట్టణంలో కొనసాగుతున్న న్యాయ పోరాటానికి సంకేతంగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రిలే నిరసన దీక్ష మూడవ రోజుకు చేరి మూడవ రోజు కూడా రిలే నిరసన దీక్ష ఉధృతంగా కొనసాగుతోంది. నిరంతర వర్షం కురుస్తున్నా దీక్షను విరమించకుండా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ధైర్యంగా కొనసాగిస్తున్నారు. ఆయనకు మద్దతుగా జిల్లా బీసీ జనసభ అధ్యక్షుడు చల్లా గోవర్ధన్ సహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ — "హత్యా యత్నం కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకుని శిక్ష విధించాలి. న్యాయం జరగకపోతే ఈ నిరసన మరింత ఉధృతం అవుతుంది" అని హెచ్చరించారు. స్థానిక ప్రజలు కూడా ఈ నిరసనకు సంఘీభావం వ్యక్తం చేస్తూ ఆందోళన స్థలానికి చేరుతున్నారు. వర్షపు ధాటికి కదలకుండా కొనసాగుతున్న ఈ దీక్ష బయ్యారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. "వర్షం కాదు.. వేదన మమ్మల్ని కదిలిస్తోంది. న్యాయం జరిగేవరకు మా దీక్ష కొనసాగుతుంది" అని నాయిని శ్రీనివాస్ రెడ్డి స్పష్టంగా పేర్కొన్నారు.

## ఏసీబీ వలలో పెద్ద అంబర్పేట్ లైన్ ఇన్స్పెక్టర్



**విశాల భారతి, పెద్ద అంబర్ పేట్:** హైదరాబాద్ జిల్లాలో విద్యుత్ శాఖలో అవినీతి బయటపడింది. పెద్ద అంబర్‌పేట్ AE (ఆపరేషన్స్) కార్యాలయానికి చెందిన లైన్ ఇన్స్పెక్టర్ ప్రభు లాల్ లంచం స్వీకరిస్తూ అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారుల చేతిలో చిక్కాడు.ఏసీబీ అధికారులు విడుదల చేసిన వివరాల ప్రకారం — అక్టోబర్ 29న ప్రభు లాల్ తూఆజా టిఫిన్స్ వద్ద ఫిర్యాదుదారుని నుండి రూ.6,000 లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఫిర్యాదుదారు తనకు కేటాయించిన 63 K.V. ట్రాన్స్‌ఫార్మర్, కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులు విడుదల చేయడానికి అధికార సహాయం చేస్తానని చెప్పి ప్రభు లాల్ లంచం డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఏసీబీ అధికారులు ఆ మొత్తాన్ని నిందితుడి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. ఆయన తన పదవిని దుర్వినియోగం చేసి, అన్యాయంగా లాభం పొందేందుకు ప్రయత్నించాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, నాంపల్లి ప్రత్యేక న్యాయమూర్తి (ACB కేసులు) ఎదుట హాజరుపరిచారు.

## పోచమ్మ కుంట చెరువు కట్ట అభివృద్ధి కై ప్రత్యేక ప్రణాళికలు

**మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, అధికారులతో కలిసి పరిశీలన**



**మేడిపల్లి, విశాలభారతి:** పీర్జాదిగూడ నగరంలోని ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారబోతున్న పోచమ్మ కుంట చెరువు అభివృద్ధి పనుల కోసం మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ అధికారులతో కలిసి చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల విహార యాత్రకు, పర్యావరణ పరిరక్షణకు, నగర సుందరీకరణకు చెరువుల అభివృద్ధి ఎంతో అవసరం. అందుకే చెరువును అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. హెచ్ఎండిఏ (HMDA) నిధులలో ఒక కోటి 33 లక్షల రూపాయల వ్యయంతో* చెరువు కట్ట వెంబడి ఫుట్‌పాత్ నిర్మాణం, బ్యూటిఫికేషన్, కట్ట బలపరచడం, లైటింగ్ సదుపాయాలు, మొక్కల నాటకం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, D. E సాయి నాద్ గౌడ్ గారు. A. E గారు. టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు స్థానిక నాయకులు, కాలనీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో వరదనీరు



- **జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**
- **ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ సమీక్ష**

**డోర్నకల్, విశాలభారతి :** ఇటీవలి భారీ వర్షాల కారణంగా డోర్నకల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిలిచిన వరదనీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు. రైల్వే, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ విభాగాల సిబ్బంది సమన్వయంతో రాత్రింబగళ్లు కృషి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ శ్రీ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ స్టేషన్‌ను సందర్శించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. రైల్వే ట్రాక్‌పై నిలిచిన నీటిని తొలగించి, బుద్ధారం చెరువులోకి వరద నీటిని మళ్లించే చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు రైల్వే సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. అధికారుల సమన్వయంతో రైల్వే స్టేషన్ పరిసరాలు క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నట్లు సమాచారం.

## ఇల్లు కూలి అవస్థలు పడుతున్న పేద దళితుడు

**ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూపులు**

**సీరోల్ విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం, కాంపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో నివసిస్తున్న పేద దళితుడు కొమ్ము ఉప్పలయ్య (దుర్గయ్య కుమారుడు) తీవ్రమైన కష్టాల్లో జీవన మృత్యువుల మధ్య పోరాడుతున్నాడు. రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అతను నివసిస్తున్న పాత ఇంటి గోడలు కూలి, మిగిలిన భాగం కూడా శిథిలావస్థకు చేరింది. ఇంటి లోపల వర్షపు నీరు నిండిపోవడంతో రాత్రింబవళ్లు తడిసిన నేలపైనే గడపాల్సి వస్తోంది. తినటానికి తిండి లేక, ఉండటానికి సురక్షితమైన స్థలం లేక ఉప్పలయ్య దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ వృద్ధుడి దుస్థితిని గ్రామస్తులు చూసి చలించిపోతున్నారు. గత కొన్నేళ్లుగా ఇల్లు కోసం అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడం ఆయన ఆవేదనగా చెబుతున్నాడు. "ఒక గుడిసె ఇల్లు ఉన్నా వానలు పడితే అది కూడా కూలిపోయింది. ఇప్పుడు ఎక్కడ ఉండాలో తెలియడం లేదు. ఒక్కరినే ఉన్నాను, సహాయం చేసే వారే లేరు. ప్రభుత్వం చూసుకుంటే చాలు," అని కన్నీళ్లు మునిగిన గొంతుతో ఉప్పలయ్య చెప్పాడు. గ్రామస్థులు ఈ వృద్ధుడికి ఇందిరమ్మ ఇల్లు, వృద్ధాప్య పెన్షన్, మరియు అత్యవసర సహాయం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి సహాయం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## గుండ్రాతిమడుగు స్టేషన్‌లో నిలిచిపోయిన రైలు

**ప్రయాణికులకు సాయం చేసిన కురవి పోలీసులు**



**కురవి, విశాలభారతి:** భారీ వర్షాల కారణంగా గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ వద్ద సుమారు ఐదు గంటల పాటు ముంబై భువనేశ్వర్ వెళ్ళు కోణార్క్ ఎక్స్ప్రెస్ రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన కురవి సీఐ సర్వయ్య వెంటనే స్పందించి, వారి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. సీఐ సర్వయ్య సూచనల మేరకు రైలులో చిక్కుకుపోయిన ప్రయాణికులకు పండ్లు, వాటర్ బాటిల్లు, స్నాక్స్ పంపిణీ చేయడం ద్వారా వారికి కొంత ఉపశమనం కలిగించారు. వర్షం ఆగకపోయినా, పోలీసులు తమ సేవా భావంతో ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించి యూత్ నాయకులు మాలోత్ సూర్య నాయక్, బానోత్ హుస్సేన్, లక్ష్మణ్, చెరుకుపల్లి శ్రీను, భూక్యా గణేష్, రుడావత్ వీరు, భూక్యా రాంసింగ్ తదితరులకు సీఐ సర్వయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించే పోలీసు శాఖపై స్థానికులు గర్వం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజల కష్టసమయంలో తోడుగా ఉండటమే నిజమైన పోలీస్ " అని సీఐ సర్వయ్య అన్నారు. ప్రజల మనసులో సీఐ సర్వయ్య మానవతా సేవ శాశ్వత ముద్ర వేసిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మావోయిస్ట్ సభ్యులకు రివార్డ్ చెక్కులు

**అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**



కొత్తగూడెం, విశాలభారతి:నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పని చేస్తూ ఇటీవల కాలంలో జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు బుధవారం 9,50,000/ల రూపాయల నగదును చెక్కుల రూపంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఎస్పీ కార్యాలయంలో చెక్కుల రూపంలో రివార్డు నగదులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ మాట్లాడుతూ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలియజేసారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకుని వారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ మరియు ఆర్ఐ ఆపరేషన్స్ రవి లు పాల్గొన్నారు.

## ఖాసీంను పరామర్శించిన సహృదయ ఫౌండేషన్ బృందం

**బూర్గంపహాడ్, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం అంజనాపురం గ్రామంకు చెందిన ఎస్.కె ఖాసీం కి అనారోగ్య కారణంతో ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి వైద్య ఖర్చులు భారమై బుధవారం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అంజనాపురం గ్రామానికి చెందిన ఖాసిం మిత్రులు రూ.12వేలు సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సునీత రూ. 6వేలు మొత్తం 18 వేల రూపాయలను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులకి అందజేసి ఖాసిం ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తుల్లుబెళ్ళ సునీత, తేజవత్ గాంధీ, బాణావత్ అశోక్ కుమార్, భూక్యా ఆనందరావు, భూక్యా హేంలాల్, బాణావత్ పంతులు, బోడా అశోక్, బోడ దిలీప్, తేజావత్ భాస్కరరావు, బోరెం సంపత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

హైదరాబాద్
గురువారం
30 అక్టోబర్ 2025

CINEMA

## చాలా పెద్ద మాట అన్నావ్ నటకిరీటి..



స్టేజిల మీద గొప్పలు చెప్పడం ఈ మధ్య బాగా ఎక్కువ అయ్యిపోయింది. సినిమా మీద కాన్ఫిడెన్స్ ఉండడం మంచిదే కానీ, మైక్ ముందు ఓవర్ కాన్ఫిడెన్స్ గా మాట్లాడడం మాత్రం ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ఈ సినిమా హిట్ అవ్వకపోతే టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తాం. సినిమా బాగోకపోతే చెప్పుతో కొట్టండి. కాలర్ ఎగరేసి చెప్తున్నా సినిమా హిట్ అవుతుంది. ఇలాంటి మాటలు వినడానికి బావుంటాయి కానీ, ఒకసారి సినిమా చూసాక అవేమి లేకపోతే మాత్రం దానికన్నా అవమానం ఇంకొకటి ఉండదు. సోషల్ మీడియాలో ట్రోల్స్ కు బలి కావలసిందే.ఇక ఇప్పుడు ఇదంతా ఎందుకు అంటే.. వివాదాలు మనకు కొత్త కాదు.. మైక్ దొరికితే మనం ఏది మాట్లాడటమే మనకే తెలియదు. ఎన్నిసార్లు ట్రోల్స్ అయినా మనకు పట్టింపు లేదు అనుకుంటాడో ఏమో.. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్.. మరోసారి మైక్ ముందు సంచలన వ్యాఖ్యలే చేశాడు. మాస్ మహారాజా రవితేజ, శ్రీలీల జంటగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం మాస్ జాతర. నాగవంశీ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రానుంది.రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మేకర్స్ గతరాత్రి మాస్ జాతర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన రాజేంద్ర ప్రసాద్ కూడా ఈ ఈవెంట్ కు హాజరయ్యాడు. ఇక స్టేజ్ మీద రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'చాలాకాలం తరువాత ఒక అద్భుతమైన మాస్ సినిమా.. అన్ని మసాలాలు ఉన్న మాస్ సినిమా ఈ మధ్యకాలంలో ఎప్పుడు రాలేదు. ఈ సినిమాలో ఏం ఉంది.. ఏం లేదు నేను చెప్పను. అది మీరు థియేటర్ లోనే చూడాలి. ఈ సినిమా చూసి మీరు షాక్ అవ్వకపోతే నేను సినిమా ఇండస్ట్రీ నుండి వెళ్లిపోతా' అంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం నట కిరీటి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.

## చిరంజీవి సినిమాలో నేను లేను..



మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## హీరోయిన్‌గా మహేష్ బాబు మేనకోడలు



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసురాలు రాబోతోంది. ఆమె మరెవరో కాదు కృష్ణ మనవరాలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. త్వరలోనే సినీ రంగంలో అడుగుపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నటన, డాన్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జాన్వీ ఇప్పటికే కొన్ని కథలను విన్నట్టు సమాచారం. వాటిలో ఒక ప్రాజెక్ట్ కోసం అధికారిక ఒప్పందం కూడా పూర్తయిందని తెలుస్తుంది. త్వరలోనే ఆమె డెబ్యూ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది.జాన్వీ తల్లి మంజుల ఘట్టమనేనికి హీరోయిన్ కావాలనే కోరిక ఉండేది. ఒకప్పుడు ఆమెను కథానాయికగా ప్రకటించినప్పటికీ, కృష్ణ అభిమానులు "ఆమెని మేము హీరోయిన్‌గా చూడలేం" అంటూ వ్యతిరేకించడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. తరువాత మంజుల నిర్మాతగా, కొన్నిసార్లు నటిగా, అలాగే దర్శకురాలిగా కూడా ఇండస్ట్రీలో తన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె సినిమాల నుంచి కొంత దూరంగా ఉన్నారు. ఇప్పుడు అదే ఇంటి నుంచి మరో తరం తెరపైకి రావడానికి సిద్ధమవుతుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. మరోవైపు కృష్ణ చిన్న కుమారుడు రమేష్ బాబు తనయుడు కూడా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు. దీంతో ఘట్టమనేని కుటుంబం నుంచి కొత్త తరం ఇండస్ట్రీకి వస్తుండడంపై ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అభిమానులు ఇప్పుడు మహేష్ బాబు పిల్లలు గౌతమ్, సితార ఎప్పుడు సినిమాల్లోకి వస్తారో నని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మహేష్ బాబు ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. అయితే మంజుల తన కుమార్తె హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. ఒకప్పుడు"నీవు హీరోయిన్‌గా ఎందుకు?"అని ప్రశ్నించినవారే ఇప్పుడు"నీ కుమార్తె సినిమాల్లో రావాలి"అని ప్రోత్సహిస్తున్నారని ఆమె చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన కుమార్తె చిరునవ్వే తన ప్రార్థనలకు సమాధానం అని మంజుల ఘట్టమనేని సంతోషంగా తెలియజేసింది.

## ప్రభాస్ 'కల్కి' మరో వివాదం

### సినిమా క్రెడిట్స్ నుంచి పేరు తొలగింపు..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'కల్కి 2898 AD' మరో కొత్త వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన అగ్ర నటి దీపికా పదుకొణె పేరును ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ అవుతున్న చిత్రం చివరి క్రెడిట్స్ నుంచి మేకర్స్ తొలగించారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. 'కల్కి 2898 AD' సీక్వెల్ నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ వివాదం సద్దుమణగక ముందే ఇప్పుడు ఓటీటీలో ఉన్న కల్కి ఫస్ట్ పార్ట్‌లో క్రెడిట్స్ నుంచి దీపికా పదుకొణె పేరును తొలగించినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరలవుతున్నాయి. దీపికా పేరును తొలగించడంపై దీపికా అభిమానులు, నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. అయితే ఒకవైపు పేరును తొలగించలేదంటూ పలువురు కామెంట్లు చేయడం మొదలుపెడుతున్నారు. కాగా ఈ వివాదంపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది.

## అఖండ 2" మాసివ్ ట్రైలర్ కట్.. కసరత్తులు



నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో చేస్తున్న అవైటెడ్ సీక్వెల్ చిత్రమే అఖండ 2 తాండవం. మంచి హైప్ ని సెట్ చేసుకున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు వస్తుంది అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఇక ఈ సినిమా కోసం చూస్తున్న ఫ్యాన్స్ కి ఇంకా పాన్ ఇండియా ఆడియెన్స్ ని మెస్మరైజ్ చేయడానికి బోయపాటి అండ్ టీం ఒక సెన్సేషనల్ ట్రైలర్ కట్ కి కసరత్తులు చేస్తున్నారని తెలుస్తుంది. దెబ్బకి పాన్ ఇండియా లెవెల్లో అఖండ 2 కోసం అంతా మాట్లాడుకునేలా ఉండబోతోందని అని ఇపుడు సినీ వర్గాల్లో టాక్. ప్రస్తుతం చిత్ర యూనిట్ ఈ పనుల్లోనే నిమగ్నమై ఉన్నారట. ఇక ఈ ట్రైలర్ రిలీజ్ పై మరిన్ని డీటెయిల్స్ ముందు ముందు రానున్నాయి.

## నవీన్ చంద్రకు దక్కిన మంచి నెగటివ్ రోల్



అరవింద సమేత వీర రాఘవ' చిత్రంలో బాలిరెడ్డిగా నెగటివ్ పాత్రలో మెప్పించాడు నవీన్ చంద్ర ఇప్పుడు అదే తరహాలో మరో పవర్ ఫుల్ పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రవితేజ శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'భాను భోగవరపు దర్శకత్వం చేయగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ చిత్రంలో నెగిటివ్ రోల్ లో నవీన్ చంద్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన మాస్ జాతర ట్రైలర్ లో నవీన్ చంద్ర వాయిస్ ఓవర్ తో మొదలై 'కేజీ రెండు కేజీలు కాదురా! 20 టన్నులు. ఈ రాత్రికే సరుకు గూడ్స్ ట్రైన్ లో ఎక్కించండి' అంటూ నవీన్ చంద్ర గంభీరమైన గొంతుతో అలరించాడు. దీనిని బట్టి చూస్తే ఈ చిత్రంలో ఆయనకు ప్రధాన పాత్రే దక్కిందని తెలుస్తోంది. ట్రైలర్ లో ఆయన కనిపించిన ప్రతి సీన్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. నవీన్ చంద్ర లుక్, జుట్టు గడ్డంతో ఎంతో రగ్గడ్ గా కనిపిస్తూ ట్రైలర్ లోని మరొక డైలాగ్ తో తన క్యారెక్టర్ ఎంత ఇంటెన్సిఫైడ్ గా పవర్ ఫుల్ గా ఉంటుందో కేవలం ఆ ఒక్క డైలాగుతూనే అర్థమవుతుంది. 'లక్ష్మణుడు అంటే రాముడి బ్రదర్. అర్థాయిషుతో పోతే ఆంజనేయుడు బ్రతికించిన క్యారెక్టర్! ఇక్కడ సంజీవని లేదు, ఆంజనేయుడు రాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.